దేశాన్ని దేశ భవిష్యత్తుని మార్చేసే మారణకాండ ఇంకో ఆరు గంటల్లో ప్రారంభమవుతుంది.

గోల్డెన్ దీవికి ఓడ చేరుకున్నదని వార్త వచ్చింది.

దేశం గాఢనిద్రలో వుంది.

టెర్రరిస్టులు దేశపు వివిధ ప్రాంతాల్లో నెమ్మదిగా సర్దుకుంటున్నారు.

తేదీ మారుతోంది.

పరమేశ్వరం నిద్రకి ఆయత్తమవుతూండగా ఫోన్ మ్రోగింది.

హల్లో అన్నాడు రిసీవర్ ఎత్తి.

సర్ నేను A-12 మాట్లాడుతున్నాను అట్నుంచి కంగారుగా వినిపించింది. అతడో ఇన్‌ఫార్మర్.

ఏమిటి ఏమైంది?

మినిష్టర్ సూర్యారావు స్వామి గురించి చేసిన అభియోగాలన్నీ పేపర్‌లో వచ్చేస్తున్నాయి సార్ మొదటి ఎడిషన్ రిలీజ్ అవుతోంది.

పరమేశ్వరం విసుగ్గా ఆ విషయం కొత్తేముంది? అంతా తెలిసిందేగా అన్నాడు.

మీరనుకున్నది వేరు. ఇప్పుడు వస్తున్నది వేరు.

పరమేశ్వరం ఉలిక్కిపడి ఏమిటి? నిద్ర తేలిపోయింది.

అవును సర్ విహారి మనల్ని మోసం చేశాడు. మొత్తం రెండు సెట్లు ఒక సెట్టు మనం చూసి పర్వాలేదులే అనుకున్నాం కానీ ఇప్పుడు ప్రింటయింది వేరు. అందులో స్వామి స్విస్ బ్యాంక్ అకౌంట్ నుంచీ గోల్డెన్ బీచ్ వరకూ అన్నీ వున్నాయి.

మైగాడ్ నిజమా? నువ్వు చెపుతున్నది నిజమేనా? పరమేశ్వరం చేతిలో రిసీవర్ వణికింది.

నిజం సర్ ఆ పేపరు నా చేతిలోనే వుంది.

ఏయే పేపర్లలో వస్తోంది?

ఈ రోజయితే ఒక్క పేపర్లోనే వస్తోంది. ఇంకా బలమైన సాక్ష్యాలుంటే గానీ వెయ్యమని రేపటికి వాయిదా వేసాయి మిగతా పేపర్లు ఈ ఒక్క పేపరు మాత్రం మిగతా వాటికంటే ముందుండాలన్న ఉద్దేశ్యంతో దొరికిన ఇన్ఫర్మేషన్ దొరికినట్టుగా వేసేసింది. విలేఖర్లందరూ రేపు సూర్యారావు దగ్గరికి వెళ్తున్నారు.

పరమేశ్వరం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. కొంతలో కొంత సాయం. పాదరసం కన్నా వేగంగా సాగే అతడి ఆలోచనలు వెంటనే ఏం జరగాలో ఆలోచించాయి.

సిటీ ఎడిషన్ పేపరు రిలీజ్ అవకుండా ఆపాలి. అది వెంటనే జరగాలి. రేపటికి సూర్యారావు మట్లాడకుండా చెయ్యాలి. దానికి సామ దాన భేద దండోపాయల్లో ఏదో ఒకటి ఉపయోగించాలి. అది రెండో స్టెప్పు పేపర్లు ఇంకా ముందు ముందు స్వామి గురించి

సాక్షాధారాల్లేకుండా వ్రాయటానికి వీల్లేకుండా కోర్టునుంచి స్టే సంపాదించాలి. అది తర్వాత చెయ్యాల్సింది.

అంతా చకచకా ఆలోచించి సిటీ ఎడిషన్ ఎప్పుడు ఊళ్ళోకి వస్తుంది అని అడిగాడు.

ఇంకో పది నిముషాల్లో వ్యాను బయలుదేరుతుంది. ప్రింటింగ్ ఊరికి దూరంగా వున్న ప్రెస్‌లో జరుగుతుంది. అక్కణ్ణుంచి ఊళ్ళోకి రాత్రి మూడింటికి వస్తాయి పేపరు కట్టలు. నాలుగింటికి వివిధ ప్రాంతాల కుర్రవాళ్ళు ఆ కట్టల్ని విడగొట్టి పంచుకుంటారు. అయిదింటికి దాదాపు లక్షకాపీలు ఆ విధంగా నగరమంతా డిస్ట్రిబ్యూట్ చెయ్యబడతాయి.

దాన్ని ఆపు చెయ్యాలి.

పరమేశ్వరం మరో అనుచరుడికి ఫోన్ చేశాడు. క్షణాల్లో ఏర్పాట్లు జరిగిపోయాయి. రెండు జీపులూ బయలుదేరాయి. వెనుకదాన్లో పరమేశ్వరం కూర్చుని వున్నాడు.

జీపులు నడుపుతున్న వాళ్ళు ఇటువంటి విషయాల్లో ప్రొఫెషనల్స్.

ముందు జీప్‌లో పెట్రోలు డబ్బాలున్నాయి. డ్రైవరు మరో అనుచరుడు ముందు సీట్లో కూర్చుని వున్నాడు. ఇద్దరు డ్రైవర్ల దగ్గర వాకీ టాకీలున్నాయి. రెండో జీపు పత్రికాఫీసు దగ్గరికి ముందుకు వెళ్ళిపోయింది.

రెండు కిలోమీటర్లు ఇవతలగా మొదటి జీపు ఆగిపోయింది.

అయిదు నిమిషాల తరువాత పేపర్ వ్యాన్ నగరం వైపు బయలు దేరింది. అది స్టార్టవ్వగానే వాకీ టాకీలో ఆ విషయం మొదటి జీపుకు తెలియబరచడం జరిగింది.

అక్కణ్ణుంచి ప్లానింగ్ వెంట్రుకవాసి కూడా తేడా లేకుండా సాగింది.

పేపర్ వ్యాన్ సరిగ్గా రెండో కిలోమీటర్ దగ్గర కొచ్చేసరికి పరమేశ్వరం కూర్చున్న జీపు వెనుకనుంచి హారన్ కొట్టుకుంటూ ముందుకు వచ్చింది. అయితే దాన్ని కుడి నుంచి ఓవర్ టేకు చేయకుండా ఎడమ నుంచి ముందుకు సాగింది. దాన్ని ఊహించని డ్రైవరు కాస్త ఉలికిపాటుతో వ్యాన్‌ని మరింత కుడికి కోశాడు. సరీగ్గా అదే సమయానికి ముందునుంచి జీపు వచ్చింది. వ్యాను డ్రైవరు మరింత బెదిరి, సరి అయిన పొజిషన్‌కి తిప్పే లోపులోనే రెండు వాహనాలు దగ్గిరవటం రోడ్డు ప్రక్కకి వ్యాను జారిపోవటం జరిగింది. జీపు వేగంగా వెళ్ళి వ్యాను వెనుక వైపు కొట్టుకుంది. వ్యాను ముందు భాగానికి దెబ్బ తగల్లేదు కానీ వెనుకవైపు వున్న పేపరు కట్టలు దొర్లుకుంటూ పడిపోయాయి. డబ్బాల్లో పెట్రోలు ప్రవాహంలా జారింది. మరుక్షణం ఆ పేపర్లు అంటుకుని పెద్దమంట లేచింది. దాదాపు రెండు నిముషాల పాటు చీకటి మధ్య వెలుగు నాట్యం చేసింది.

పేపరు వ్యాన్ తాలూకు డ్రైవర్ భయంతో వణికిపోయాడు. వెనుకనుంచి వచ్చిన జీపు ఎప్పుడో వెళ్ళిపోయింది. తనే కుడికి కోసి ఈ ఆక్సిడెంట్‌కి కారణభూతుడయ్యాడన్న ఫీలింగు తనకి మిగిలిపోయింది. ఆక్సిడెంట్స్‌లో ఇది మామూలే. ఎవరో సడెన్‌గా ఎదురొస్తారు. వాహనం పక్కకి తిప్పగానే మరో వాహనం వచ్చి కొట్టుకుంది. తప్పంతా పక్కకి తిప్పిన వాహనం డ్రైవర్‌దే అవుతుంది. ఎదురొచ్చిన మనిషి ఎప్పుడో జారుకుంటాడు.

వాన్ డ్రైవర్ పరిస్థితి ఇప్పుడలాగే వుంది.

పరమేశ్వరానికి కావల్సిందదే. జీపుకి కలిగిన నష్టం గురించి ఆలోచించటం లేదతడు. మళ్ళీ ఎల్లుండి పేపర్లో పేపరు వ్యాన్‌పై దుండగుల దౌర్జన్యం అని పడకుండా వుంటే చాలు సరిగ్గా దాన్ని సాధించంటం కోసమే ఇంత జాగ్రత్తగా ప్లాన్ వేశాడు.

అతడికి చాలా అలసటగా అనిపించింది. ఆ రాత్రి సుదీర్ఘంగా సాగుతోన్నట్టు తోచింది. రామ్‌లాల్ కళ్లముందు మరణించడం తను పక్కనుండగా మృత్యువు షాండ్లియర్ రూపంలో సమీపించడం స్వంత కొడుకు తనకన్నా తెలివిగా ప్లాన్ చేసి బోల్తా కొట్టించడం ఇవన్నీ ఒకరాత్రిలో జరిగి అతడి శక్తిని పీల్చేశాయి ఇవన్నీ ఒక వైపు అతడిలో రగులుతూన్న చిరాకు మరొకవైపు ఏదో తెలియని అంత సంఘర్షణ వర్షపు జల్లులూ మొహం మీద కొచ్చి పడిన రామ్‌లాల్ రక్తం.

మొత్తానికి ఎలాగయితేనేం విజయాన్ని సాధించాడు పేపర్లు నగరంలోకి వెళ్ళలేదు....... అయితే ఇంకా ఈరోజు చెయ్యవలసింది చాలా వుంది. స్వామి అగ్ని ప్రవేశం ఆ తరువాత సుర్యారావుతో రాజీ చేసుకునో స్మాష్ చేసో ఆ వివరాలు మళ్ళీ పేపర్లకి చేరకుండా చూడడం. ఇప్పటికే పత్రికా కార్యాలయాలకు చేరిన సాక్ష్యాల్ని మాయం చేయటం. వీలయితే విలేఖర్లని కొనెయ్యటం ఇవన్నీ రాబోయే ఇరవై నాలుగు గంటల్లో చెయ్యాలి.

ఇవన్నీ గాక రాబోయే ఇరవై నాలుగు గంటల్లో దేశపు పరిస్థితిని దిగజార్చి స్వామిని అంచెలంచెలుగా పైకి లేపాలి. విదేశీ శక్తుల్తో సమాలోచనలు స్వదేశీయుల్తో సంప్రదింపులు.

పరమేశ్వరం గాఢంగా నిట్టూర్చాడు.

ఇవన్నీ చేస్తే స్వామి నియంత అవుతాడు. తను చాణుక్యుడిలా దేశాన్ని ఏల్తాడు.

అతడికి గతం గుర్తు వచ్చింది. డబ్బురాదని తెలిసిన భార్యని వదిలెయ్యటం, స్వామి పంచన చేరటం క్రిమినల్ లాయర్‌గా మారటం.

అతడికి తన కొడుకు గుర్తువచ్చాడు. తన రక్తం ....... అవును ....... అందుకే యిలా ఎత్తులు వేయగల్గుతున్నాడు. కానీ అనుభవం చాలదు. ఉడుకు రక్తం. ప్రపంచం అంతా మంచేనని ఆలోచించే వయసు. ఈ దౌర్భాగ్య ప్రపంచంలో అది పనికి రాదని చెప్పాలి.

ఎందుకో అతడికి ఆ క్షణం కొడుకుని చూడాలనిపించింది. దగ్గిర కూర్చోపెట్టి మనుషుల్లో పరిణామ క్రమం గురించి స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్సు గురించి తెలివి స్వార్థం గురించి గుర్తింపు కోసం తెలివైన మనిషిపడే పాట్లు గురించి వెతికే దార్ల గురించీ చెప్పాలనిపించింది. అయితే నదికి చెరోవైపునా వున్న ఇద్దరు వ్యక్తుల సంభాషణ ఎంత కష్టమో అలా పరస్పరం వ్యతిరేక సిద్ధాంతాలతో వున్న తామిద్దరూ కలిసి, మాట్లాడుకోవడం కూడా అంత అసాధ్యమనుకున్నాడు.

ఇక్కడ కూడా కాస్త వెనుకబడే వున్నాడు. అతడు అసాధ్యం అనుకున్నది విహారి చేసి చూపించాడు. ఎలా అతడు తన కొడుకును దగ్గిర కూర్చోబెట్టుకుని తన వాదన

కూడా .......

మరింత తెలివితేటల్తో.

*                                                  *                                  *

ప్రవల్లికకి తెల్లవారుజామున అయిదింటికి లేవటం అలవాటు. వేసవికాలమైతే నాలుగున్నరకే లేస్తుంది. దాదాపు గంటసేపు స్కిప్పింగ్ మిగతా ఎక్సర్ సైజులు చేయటంతో దినచర్య ప్రారంభమవుతుంది. ఎన్ని వర్రీస్ వున్నా రాత్రయ్యేసరికి హాయిగా నిద్రపోవడం ఆమె కలవాటు. రేప్రొద్దున ఇంటర్వ్యూనో పెళ్ళిచూపులో అంటేనే ఆ రాత్రంతా టెన్షన్‌తో నిద్రలేకుండా గడిపే యువతీ యువకులకు భిన్నంగా పెంచాడామెని ప్రతాపరావు. అదే లేకపోతే ఆ డిపార్ట్‌మెంట్‌లో ఏ రాత్రీ నిద్రవుండదు.

యధావిధిగా ఆమె తెల్లవార్నే లేచింది.

ఆ రోజు తన జీవితంలో ప్రాముఖ్యత సంతరించుకున్న రోజు అని ఆమెకు తెలుసు. స్వామి లక్షలాది భక్తుల ముందు అగ్ని ప్రవేశం చేసి దేశపు సుస్థిరత కోసం సౌభాగ్యం కోసం పునీతుడై రాబోతున్నారు ఆ రోజు.

స్వామి ఆట కట్టించడానికి చెయ్యవలసిన పనులు చేసి రెడీగా ఉన్నారు తాము. అటో ఇటో తేలిపోతుంది. చెరోవెపు సైన్యాన్ని మోహరించి పోరాటానికి ఆయత్తమయిన ఇరువర్గాల్లా ఉన్నారు. అనుకున్నది అనుకున్నట్టే జరిగితే ఆమె జీవితాశయం నెరవేరబోయే రోజు అది.

ఐదున్నర అయింది.

అరయింది.

పేపరు రాలేదు.

ఆరుంపావు.

ఆరున్నర.

ఆమెకి అనుమానం వేసి విహారికి ఫోన్ చేసింది.

ఔను ఆ అనుమానమే నాకూ వచ్చింది. ఇప్పుడే పత్రికాఫీసుకు ఫోన్ చేశాను. సిటీ ఎడిషన్ తీసుకు వస్తున్న పేపర్ వ్యాన్‌కి ఆక్సిడెంట్ అయిందట.

ప్రవల్లికకు సర్వశక్తులు తోడేసినట్లు అయింది. ప్రత్యర్థులకు ఒక రోజు టైము దొరికింది. ఒక్కరోజులో ఏమైనా చెయ్యగలరు ప్రొద్దున్నే ఈ వార్త అపశకునంలా తోచింది.

ఆమె మౌనంగా ఉండడం చూసి అటునుంచి విహారి నవ్వాడు. దీని గురించి నేను ఒకటి ఆలోచించాను.

ఆమెకు హాయిగా అన్పించింది. కష్టం అనుకున్నప్పుడు ఆ మాత్రం మాట సాయం ఎంతో గొప్ప శక్తినిస్తుంది అలాంటి శక్తి ఏమిటో అనుభవం మీదే తెలుస్తుంది.

ఏమిటి? అంది ఆతృతతో.

మీకూ సిటీ పోలీస్‌కి సంబంధాలు ఎలా ఉన్నాయి?

వ్యతిరేకత ఏమీలేదు.

సిటీ పేపర్లు కాలిపోయాయి. కాని డిస్ట్రిక్ట్స్‌కి వెళ్ళిపోయి ఉంటాయి కదా.

వెళితే? అంది ఆమె అతడేం చెపుతున్నాడో అర్థంకాక అనుమానంగా.

జిల్లా ముఖ్య పట్టణాలకు వెళ్తున్న పేపర్లు అక్కడికి చేరుకోవటానికి ఏడు ఏడున్నర అవుతుంది వాటిని అక్కడికక్కడే సీజ్ చేసి వెనక్కి తెప్పించి ఇక్కడ రిలీజ్ చెయ్యాలి ....... స్వామి మీటింగ్ మొదలు పెట్టె సమయానికి.

కానీ రాత్రి మూడింటికే ఆ వ్యాన్లు అన్ని వేపులకి బయలుదేరిపోయి ఈ పాటికి వేర్వేరు జిల్లాలకు చేరబోతూ ఉంటాయి కూడా.

ఇంకో గంట టైముంది.

ఇంకో గంటలో వాటిని ఎలా తీసుకురాగలం?

హెలికాప్టర్ ద్వారా తాపీగా అన్నాడు.

ఆమె ఉలిక్కిపడలేదు. ఆలోచిస్తోంది. యుద్ధంలో ప్రత్యర్థి కత్తి ఎత్తినప్పుడు అయ్యో ఇప్పుడెలా? మనం కత్తి తీయటానికే టైమ్ సరిపోతుందా? అని ఆలోచించటానికే టైము వుండదు చకచకా పనులు చేసుకుంటూ పోవటమే.

నేనిప్పుడు చీఫ్ దగ్గరకి వెళుతన్నాను అని ఫోన్ పెట్టేసింది.

అయిదు నిముషాలలో ఆమె చీఫ్ దగ్గర వుంది. అయన అప్పుడే పూజ ముగించినట్లున్నాడు పంచె మీద తువ్వాలు వేసుకుని ఉన్నాడు.

ఏమ్మా ఇంత ప్రొద్దున్నే ఇలా వచ్చావు?

మీ చేతి తాయెత్తు ఏది? ఆమె అడిగిన మొదటి ప్రశ్న అది.

చీఫ్ ఆశ్చర్యంతో తాయెత్తు ఏమిటి? అన్నాడు.

స్వామి కట్టింది.

పూజ గదిలో పెట్టాను. ఏం?

ఆయన అనుమతి తీసుకుని ఆమె ఆ గదిలోకి వెళ్ళి దాన్ని తీసుకుంది. డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాక జాగ్రత్తగా దాన్ని విప్పి అంది. ఆయన విస్మయంగా ఆమె చర్యల్ని గమనిస్తున్నాడు.

లోపల్నించి చిన్న వైరు మైక్రోఫోన్ బయటపడ్డాయి. చీఫ్ అదిరిపడి మైగాడ్ అనబోయాడు.

ఆమె చప్పున మైక్రోఫోన్ చేత్తో మూసింది. చీఫ్ కూడా అదే డిపార్ట్‌మెంట్ కావటం వల్ల ఆమె చర్యల్ని అర్థం చేసుకోగలిగాడు.